ప్రజాశక్తి

మంగళవారం 23 డిసెంబరు, 2025

బారులుతీరిన ధాన్యం వాహనాలు

నందిగాం : మండలంలోని మిల్లుల వద్ద ధాన్యం లోడుతో వాహనాలు బారులు తీరాయి. మండలంలోని పెద్దతామరపల్లి, పెంటఊరు మిల్లులకే బ్యాంకు గ్యారంటీ ఉండడంతో ఆయా మిల్లులకే మండలంలోని 23 సచివాలయాల నుంచి ట్రక్ సీట్ నమోదయ్యాయి. దీంతో సోమవారం ఒక్కసారిగా వాహనాలు తరలిరావడంతో బారులుదీరాయి. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలో 11 మిల్లులు ఉన్నా... రెండు మిల్లులకే బ్యాంకు గ్యారంటీ ఇవ్వడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

బారులు తీరిన వాహనాలు

'ఉపాధి' ఉసురు తీయొద్దు

చట్ట సవరణలకు నిరసనగా వామపక్షాలు, ప్రజాసంఘాల ధర్నా

శ్రీకాకుళం : ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

గ్రామీణ పేదల జీవనోపాధిలో కీలకపాత్ర పోషిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ దాని స్థానంలో 'విబి-జి రామ్ జి' పేరుతో తీసుకువచ్చిన బిల్లును ఉపసంహరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ నాయకులు కె.శ్రీను డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కేంద్రం చేస్తున్న సవరణలకు నిరసనగా వామపక్షాల ఆధ్వర్యాన నగరంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టబద్ధ హక్కుగా ఉన్న ఉపాధి హామీని రద్దు చేసేందుకు కేంద్రం చేస్తున్న కుట్రలను వామపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం తెస్తున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (విబి-జి రామ్ జి) పేరుతో ఉపాధి హామీ చట్టానికి రామ రామ పలకనున్నారని అన్నారు. పని హక్కుగా ఉన్న పాత చట్టాన్ని మార్చి ఇదో సాధారణ పథకంగా అమలు చేయనున్నారని చెప్పారు. ఇప్పటివరకు వ్యవసాయ కార్మికులు డిమాండ్‌ను బట్టి ఉపాధి కల్పించే విధానాన్ని మార్చివేసి అవసరాన్ని బట్టి పనులు పెట్టడమంటే ఉపాధి చట్టం మౌలిక స్వభావాన్ని నిర్వీర్యం చేయడమేనన్నారు. మోడీ ప్రభుత్వం ఈ చట్టంలోని మహాత్మాగాంధీ పేరును తొలగించి ద్రోహం చేస్తోందన్నారు. ఉపాధి హామీ అమల్లో కీలకమైన రాష్ట్రాల భాగస్వామ్యం కొత్త బిల్లు వల్ల నామమాత్రంగా మారుతుందని తెలిపారు. ఇప్పటికే యంత్రాలు కేటాయించి కూలీల డిమాండ్ తగ్గించిన విషయాన్ని గుర్తుచేశారు. వ్యవసాయ పనుల పేరుతో 60 రోజుల ఉపాధి పనిని సస్పెండ్ చేసి, ఈ పథకాన్ని రైతులకు పోటీగా మారుస్తుందని విమర్శించారు. ఈ పథకం అమలుకు కేంద్రం ఇస్తున్న శాతం నిధులను 60 శాతానికి తగ్గించి రాష్ట్రాలపై రూ.వేల కోట్ల అదనపు భారం మోపుతున్నారని తెలిపారు. మన రాష్ట్రంపై ఏటా సుమారు రూ.నాలుగు వేల కోట్ల అదనపు భారం పడనుందన్నారు. ఇప్పటికే రూ.లక్షల కోట్ల అప్పుల్లో ఉన్న రాష్ట్రం ఈ అదనపు భారాన్ని ఎలా భరించగలదని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వానికి కీలక మద్దతుగా ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీలు కొత్త ఉపాధి బిల్లును ఉపసంహరించుకునేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. మన రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపీలు పార్లమెంటులో దీన్ని వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు జి.సింహాచలం, పి.తేజేశ్వరరావు, కె.నాగమణి, పోలాకి ప్రసాదరావు, కొత్తకోట అప్పారావు, ఎ.సత్యం, ఎం.గోవర్ధనరావు, ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పలాస : వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన పలాస ఆర్‌డిఒ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ జి.వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి బి.సన్యాసిరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.వెంకటరావు, ఐఎఫ్‌టియు నాయకులు జుత్తు వీరాస్వామి, ఎఐకెఎంఎస్ కార్యదర్శి ఎం.రామారావు, సిఐటియు కార్యదర్శి ఎన్.గణపతి, జీడిరైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్‌కుమార్, రైతుకూలీ సంఘం నాయకులు కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పలాస : ధర్నా చేస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

కపోతాన్ని ఎగురవేస్తున్న ఎస్‌పి మహేశ్వరరావు

నిబద్ధతతో శిక్షణ పొందాలి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

కానిస్టేబుల్ శిక్షణ సమయంలో క్రమశిక్షణ, నిబద్ధత, శారీరక దృఢత్వం, సాంకేతిక నైపుణ్యం, ప్రజలపై సేవాభావమే ముఖ్యమని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి అన్నారు. మండలంలోని తండాంవలసలో జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో నూతనంగా పోలీస్ కానిస్టేబుళ్లుగా ఎంపికైన స్టైపండియరీ క్యాడెట్ ట్రెయినీ పోలీస్ శిక్షణను సోమవారం ప్రారంభించారు. రాజమండ్రి, కృష్ణా జిల్లాలకు చెందిన 145 మంది అభ్యర్థులకు శిక్షణ ఇస్తున్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ సమయంలో చట్టాలపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సమయాన్ని వృథా చేయకుండా శిక్షణ కాలాన్ని అత్యంత విలువైనదిగా భావించాలన్నారు. పోలీస్ ఉద్యోగం గౌరవప్రదమైన బాధ్యత అని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా విధులు నిర్వర్తించాలని తెలిపారు. పోలీస్ ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాకుండా ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు అంకితమైన సేవా వృత్తి అని అన్నారు. శిక్షణ పొందుతున్న ట్రెయినీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణ, నిబద్ధత, నిజాయితీ, ధైర్యం వంటి లక్షణాలను జీవితంలో అలవర్చుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణలో పోలీస్ విభాగం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అందుకే ప్రతి పోలీస్ సిబ్బందీ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. ప్రజల విశ్వాసమే పోలీస్ విభాగానికి మూలస్తంభమని, ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని స్పష్టం చేశారు. పోలీస్ ఉద్యోగం సవాళ్లతో కూడుకున్నదని, పని ఒత్తిడి మధ్యన కూడా చట్టబద్ధత, నైతిక విలువలు, మానవత్వాన్ని ఎప్పటికీ వదలకూడదని హితవుపలికారు. ప్రతి పోలీస్ సిబ్బంది ప్రజల దృష్టిలో నమ్మకమైన రక్షకుడిగా నిలవాలన్నారు. పోలీస్ యూనిఫాం గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. అదనపు ఎస్‌పి, ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ కె.వి.రమణ మాట్లాడుతూ శిక్షణ సమయంలో శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, చట్టాలపై అవగాహన, ప్రజలపై సానుభూతి, వ్యక్తిగత అభివృద్ధి, యోగా, వృత్తి, నైపుణ్యాల అభివృద్ధి అవసరమని అన్నారు. సైబర్ నేరాలు ప్రస్తుత సమాజంలో పెద్ద సవాలుగా మారాయని, సాంకేతికతను అందిపుచ్చుకొని అందుకు తగిన శిక్షణ పొందాలని సూచించారు. క్రిమినల్ లా, ప్రత్యేక చట్టాలు, ఆయుధాల వినియోగం, డ్రిల్, పరేడ్, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాలపై అవగాహన, విపత్తుల నిర్వహణ, ప్రజలతో మైత్రీ సంబంధాలు వంటి అంశాలపై సమగ్ర శిక్షణ అందించబడుతుందని తెలిపారు. ప్రత్యేకంగా కంప్యూటర్ ల్యాబ్, మెడికల్ సెంటర్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇతర మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదనపు ఎస్పీ (క్రైమ్) పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తొమ్మిది నెలల శిక్షణ కాలాన్ని క్రమశిక్షణతో సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎస్‌పి ప్రారంభించి, చివరగా శాంతికి ప్రతీకగా పావురాలను నింగిలోకి విడిచిపెట్టారు. కార్యక్రమంలో డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద, శేషాద్రి, గోవిందరావు, ఎఒ సిహెచ్.గోపీనాథ్, సిఐలు యూనిట్ మెడికల్ అధికారి, కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వైసిపి నాయకులు

నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీల విభజన

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

జిల్లాలో గ్రామ పంచాయతీల పునర్విభజన ప్రక్రియలో నిబంధనలు తుంగలో తొక్కి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆధ్వర్యాన అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్)లో సోమవారం వినతులు స్వీకరించారు. జిల్లా నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో 193 వినతులు వచ్చాయి. నరసన్నపేట నియోజకవర్గంలో సారవకోట, జలుమూరు మండలంలో పలు పంచాయతీలు స్థానిక తీర్మానాలు లేకుండా విభజనకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అధికారులు ప్రజాభిప్రాయం, పంచాయతీ తీర్మానం పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. ఆమదాలవలస నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఫిర్యాదులు చేశారు. సరుబుజ్జిలి మండలం కూనజమ్మన్నపేటలో పంచాయతీ తీర్మానం లేకుండా అంగన్‌వాడీ భవనం నిర్మిస్తున్నారని, అధికారులు నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తనకు రూ.ఆరు వేల పింఛను వస్తుందని, రూ.15 వేలు బెడ్ రెస్టు పింఛన్ అందజేయాలని ఆమదాలవలసకు చెందిన గోవింద్ ఫిర్యాదు చేశారు. మూడేళ్ల నుంచి రోడ్డు ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన తనకు పింఛను మంజూరు కావడం లేదని పాతపట్నం మండలం తామరకు చెందిన ఫల్గుణరావు ఫిర్యాదు చేశారు. ఎచ్చెర్ల మండలం కుశాలపురంలో స్వీట్స్ తయారీ యూనిట్ వ్యర్థాలు స్థానికంగా విడిచిపెడుతున్నారని జగదీష్ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మణరావు, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు అండగా ఉండాలి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం, ఉద్యోగ నియామకాలను సత్వరమే పూర్తి చేసి వారికి భరోసా కల్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డితో కలిసి గత సమావేశాల నిర్ణయాల అమలు తీరును సమీక్షించారు. బాధితులకు న్యాయం చేయడంలో అలసత్వం వహించకూడదన్నారు. 2017 నుంచి 2025 వరకు జిల్లాలో నమోదైన 12 హత్య కేసుల్లో, బాధిత కుటుంబసభ్యుల విద్యార్హతలను బట్టి 12 మందికి పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగావకాశాలు కల్పించామని వివరించారు. భూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలన్నారు.

ఎస్‌పి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో పలు కేసులు దర్యాప్తులో ఉన్నాయని, వాటిని వేగంగా పూర్తి చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుల నుంచి వచ్చే వినతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో పలువురు సభ్యులు క్షేత్రస్థాయి సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. రిమ్స్ ఆస్పత్రి అవుట్‌సోర్సింగ్ పోస్టుల్లో రోస్టర్ పద్ధతి పాటించాలని, అక్కడ పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా ఎస్‌సి, ఎస్‌టి మహిళలకు ఉపాధి కల్పించాలని, సూర్యఘర్ పథకం కింద సోలార్ ప్యానల్స్‌కు రాయితీ ఇవ్వాలని విన్నవించారు. సమావేశంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.వి లక్ష్మణమూర్తి, ఆర్‌డిఒ వెంకటేష్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మధుసూదనరావు, డిఎస్‌పిలు వివేకానంద, లక్ష్మణరావు, పలు శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఘనంగా క్రిస్మస్ సంబరాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం జిల్లావాసులు తన కుటుంబసభ్యులని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. నగరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళావేదికలో క్రిస్మస్ సంబరాలు-2025 (హైటీ) వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక మంచి భావంతో అందరినీ కలవడమే క్రిస్మస్ అని తెలిపారు. మూడు నెలలకోసారి క్రిస్టియన్ల సమస్యలపై సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. బరియేల్ గ్రౌండ్ సమస్యలపై ఇప్పటికే అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కమ్యూనిటీ హాల్‌కు మున్సిపల్ కార్పొరేషన్ నిధులు సమకూర్చనున్నట్లు తెలిపారు. అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తితో కలిసి కేకు కట్ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, ఆర్‌డిఒ సాయి ప్రత్యూష, మైనార్టీ సంక్షేమ అధికారి షరీఫ్, పాస్టర్స్ ఫెలోషిప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోసుబాబు, పాస్టర్లు పి.కృపానందం, విజయ్ కుమార్, అరుణ్ కిరణ్, బిషప్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణ చేయాలి

డిసిసిబి వద్ద పిఎసిఎస్ ఉద్యోగుల ధర్నా

ధర్నా చేస్తున్న పిఎసిఎస్ ఉద్యోగులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పిఎసిఎస్ ఉద్యోగులకు 2019, 2024 వేతన సవరణ వెంటనే చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఎపి పిఎసిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గిరిబుచ్చి రంగనాథ్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.మోహనరావు, బి.రామారావు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఆంధ్రప్రదేశ్ సహకార సంఘాల ఉద్యోగుల సంఘ ఐక్యవేదిక ఆధ్వర్యాన నగరంలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఎసిఎస్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు ప్రభుత్వాన్ని కోరినా, ఒక్క సమస్య కూడా పరిష్కరించకపోవడంతో ఐక్యవేదిక పేరిట రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాల్సి వచ్చిందన్నారు. 36 జిఒ అమలు చేయాలని, 2019, 2024 పిఆర్‌సి ఇవ్వాలన్నారు. లేకుంటే 50 శాతం తగ్గకుండా మధ్యంతర భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.రెండు లక్షల గ్రాట్యుటీ సీలింగ్ ఎత్తివేసి యాక్టు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని కోరారు. 2019 తర్వాత విధుల్లో చేరిన ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలన్నారు. సంఘాల లాభనష్టాలతో సంబంధం లేకుండా ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రూ.ఐదు లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, రూ.20 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు.

ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఈనెల 29న విజయవాడ ధర్నా చౌక్ వద్ద మహా ధర్నా చేస్తామని హెచ్చరించారు. అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకుంటే జనవరి ఐదో తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు వెళ్లి నిరవధిక నిరాహార దీక్ష చేపడతామన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తాత్సార వైఖరి విడనాడి వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అప్పటికీ పరిష్కరించకపోతే జనవరి ఐదో తేదీ నుంచి సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరవధిక నిరాహార దీక్ష చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ధర్నా అనంతరం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో పిఎసిఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు బొడ్డేపల్లి సన్యాసిరావు, కె.లక్ష్మీనారాయణ, వై.పాపినాయుడు, జగదీష్, కె.సౌజన్య, ఎ.ఉమామహేశ్వరి, దాసు, జానకిరామ్, ఐ.వి మాధురి, కె.అనూష, ఎం.అశ్విని, 49 సంఘాల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శ్రమించి చదివితే ఉజ్వల భవిష్యత్

బహుమతులతో విజేతలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రమించి చదివితే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎ.రవిబాబు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జిల్లాస్థాయి కౌశల్ విజేతల బహుమతి ప్రదానోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి వేదికైన కౌశల్ ప్రతిభా పరీక్షల్లో జిల్లా నుంచి 12 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. నేటి సమాజంలో సైన్స్, గణితం కౌశలాలను బాగా అర్థం చేసుకుంటే విద్యార్థి భవిష్యత్‌లో మంచి లక్ష్యాలను చేరుకోవచ్చని చెప్పారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు శ్రమించి చదవాలన్నారు. పోటీల వల్ల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సమస్య పరిష్కార నైపుణ్యంతో కూడిన సృజనాత్మక ఆలోచనలు పెంపొందుతాయన్నారు. జిల్లా కౌశల్ సమన్వయ అధికారి అల్లు అప్పన్న మాట్లాడుతూ కౌశల్ పోటీల్లో జిల్లాస్థాయిలో నిర్వహించిన క్విజ్, రీల్స్, పోస్టర్ ప్రజెంటేషన్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 8, 9, 10వ తరగతి విద్యార్థులను షీల్డులు, ధ్రువీకరణ పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

క్రీడా స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని కాకినాడకు చెందిన సాంకేతిక విద్యాశాఖ ఆర్‌జెడి జి.వి రామచంద్రరావు అన్నారు. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న శ్రీకాకుళం ప్రాంతీయ స్థాయి అంతర్ పాలిటెక్నిక్ క్రీడా పోటీలను సోమవారం ప్రారంభించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన తొమ్మిది కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. క్రీడా పతాకం ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో చురుగ్గా ఉండాలని చెప్పారు. ఆరోగ్యం ఉంటేనే విద్య సైతం ముందుకు సాగుతుందన్నారు. విద్యార్థులు లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు సాగాలని చెప్పారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలని సూచించారు.

అతిథులు జాతీయ, క్రీడా, కళాశాల పతకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.నారాయణరావు, అకడమిక్ అధికారి బెహరా శ్రీనివాస్, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాల్స్ బి.జానకిరామయ్య, విక్టర్ పాల్, బి.వి.ఎస్.ఎన్ మూర్తి, డి.సింహాచలం, అధ్యాపకులు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పోలియోను అరికడదాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పోలియోను అరికడదామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పిలుపునిచ్చారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యాన స్థానిక న్యాయ సేవా సదన్‌లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 21న పోలియో చుక్కలు వేయించుకోలేని చిన్నారులకు, కోర్టుకు హాజరైన కక్షిదారుల పిల్లలు, కోర్టు సిబ్బంది పిల్లలకు పోలియో చుక్కలు వేయించారు. పల్స్ పోలియో డ్రాప్స్‌ను తప్పనిసరిగా వినియోగించుకుని పోలియో రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, ప్యానల్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు వేస్తున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

బాల్య వివాహాల చట్టంపై విస్తృత ప్రచారం

బాల్య వివాహాల నిరోధక చట్టంపై విస్తృత ప్రచారం చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. స్థానిక న్యాయ సేవా సదన్‌లో ఎన్‌జిఒలు, ప్యానల్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లతో న్యాయ అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టే విధంగా పానల్ న్యాయవాదులతో మారుమూల ప్రదేశాల్లో బ్రోచర్లను పంపిణీ చేసి విస్తృత ప్రచారం చేయాలన్నారు.

చిగురువలసలో ప్రబలిన డయేరియా

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సమీపంలోని చిగురువలస గ్రామంలో డయేరియా ప్రబలింది. వారం రోజులుగా గ్రామంలో డయేరియా కేసులు నమోదవుతున్నాయి. ఇటీవల ఒకే వీధికి చెందిన సముద్రాల కృష్ణారావు, కలగట లక్ష్మి, బొమ్మల గణేష్, చెన్నూరు లక్ష్మి, బండి కృష్ణమ్మ తీవ్ర అనారోగ్యానికి గురవడంతో సరుబుజ్జిలి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యసేవలు అందించారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. అదే వీధికి చెందిన మరో ఆరుగురు అతిసార లక్షణాలతో బాధపడుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన ముద్దాడ రవి అతిసార బారినపడి తీవ్ర అనారోగ్యానికి గురవడంతో ముందుగా సరుబుజ్జిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం ఆమదాలవలస మండలంలోని (జొన్నవలస) 30 పడకల ఆసుపత్రికి తరలించడంతో అక్కడ చికిత్స పొందుతున్నాడు. గ్రామంలో డయేరియా మరింత ప్రబలకుండా తక్షణమే వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. చిగురువలస గ్రామంలో తాగునీటి టికి పంట పొలాల్లో ఉన్న నేలబావి నీటిని వినియోగించడమే అతిసార ప్రబలడానికి కారణమని భావిస్తున్నారు.

జొన్నవలస ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవి

వైద్యసేవలు అందిస్తున్నాం

చిగురువలసలో డయేరియా లక్షణాలతో ఉన్న వారిని గుర్తించి వైద్య సేవలు అందిస్తున్నామని మండల వైద్యాధికారి సాహితీ ప్రియదర్శిని తెలిపారు. ఇప్పటికే క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది గ్రామంలో పర్యటిస్తూ లక్షణాలున్న వ్యక్తులను గుర్తించి ముందస్తు వైద్య సేవలు అందిస్తూ అప్రమత్తం చేస్తున్నారని చెప్పారు.

IN THE HONOURABLE COURT OF PRINCIPAL SENIOR CIVIL JUDGE COURT AT SRIKAKULAM
I.A.No.235/2025 in O.S.No.25/2025

Between:-
Tangudu Syam Sundar, ...Petitioner/Plaintiff
And:
Gudla Revanth Kumar .....Respondent/Defendant

To,
Gudla Revanth Kumar, S/o Gudla Dharma Raju, aged years, residing at Surya Primes Grand, Flat No.103, 3rd lane, Beside Siva Balaji Temple, Bankers Colony, Srikakulam Town and District

పై నెంబరు గల పిటిషన్‌లో మీరు Respondent/Defendantగా అయి ఉన్నారు. సదరు పిటిషన్‌లో మీకు ఎన్ని సార్లు నోటీసు పింపినను అమలు జరగలేదు.మీకు నోటీస్ నిమిత్తం **తే 26-12-2025ది** వాయిదా అయి ఉన్నది. కావున ఆ రోజున మీరుగాని, లేదా మీ తరపున న్యాయవాది గారి ద్వారా గాని **ఉదయం గం॥ 10-30ని॥**లకు పైన తెలిపిన కోర్టువారి ఎదుట హాజరు కావలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వి. హరిప్రియ
న్యాయవాది, శ్రీకాకుళం,
ఫోన్: 9290866008.

IN THE HONOURABLE COURT OF PRINCIPAL SENIOR CIVIL JUDGE COURT AT SRIKAKULAM
O.S.No.25/2025

Between:-
Tangudu Syam Sundar ....Plaintiff
And:
Gudla Revanth Kumar ....Defendant

To,
Gudla Revanth Kumar, S/o Gudla Dharma Raju, aged years, residing at Surya Primes Grand, Flat No.103, 3rd lane, Beside Siva Balaji Temple, Bankers Colony, Srikakulam Town and District

పై నెంబరు గల దావాలో మీరు ప్రతివాదిగా అయి ఉన్నారు. సదరు దావాలో మీకు ఎన్ని సార్లు నోటీసు పింపినను అమలు జరగలేదు.మీకు నోటీస్ నిమిత్తం **తే 26-12-2025ది** వాయిదా అయి ఉన్నది. కావున ఆ రోజున మీరుగాని, లేదా మీ తరపున న్యాయవాది గారి ద్వారా గాని **ఉదయం గం॥ 10-30ని॥**లకు పైన తెలిపిన కోర్టువారి ఎదుట హాజరు కావలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వి. హరిప్రియ
న్యాయవాది, శ్రీకాకుళం,
ఫోన్: 9290866008.

అర్జీలు స్వీకరిస్తున్న అదనపు ఎస్‌పి శ్రీనివాసరావు

అర్జీలపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యలు స్వీకరణ, పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి పి.శ్రీనివాసరావు వినతులు స్వీకరించారు. 37 మంది వినతిపత్రాలు అందజేసి, సమస్య చెప్పుకున్నారు. ఫిర్యాదులు పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడారు. ప్రతి సమస్యపై నివేదిక అందజేయాలని సూచించారు. వచ్చిన వినతులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు చెప్పారు.

ఆరోగ్య పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ప్రజలు ఆరోగ్య ఇబ్బందులతో వైద్యానికి దూరం కాకూడదని, మెరుగైన వైద్యసేవలు అందరికి అందించడమే విశ్వజనీన ఆరోగ్య పరిరక్షణ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యమని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు పేర్కొన్నారు. మండలంలోని సింగుపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జూనైద్ అహ్మద్ మౌలానా సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఖర్చుల భారం వలన ఏటా అనేక కుటుంబాలు తీవ్ర పేదరికంలో కూరుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులపై వైద్య సిబ్బంది నిబద్ధతతో వ్యవహరించి మానవీయ కోణంలో సేవలందించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎఎన్ఎంలు, ఇతర అధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ ఆరోగ్య పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రపంచ జనాభాలో సగం మందికి ఇప్పటికీ కనీస వైద్యసేవలు అందకపోవడం శోచనీయమన్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ లిల్లీ, వైద్య సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు

తాగునీటి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రాపాక గ్రామంలోని అంబేద్కర్‌కాలనీలో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఇటీవల కాలనీలో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసినప్పటికీ నీరు రాకపోవడంతో గ్రామానికి చెందిన మండల తెలుగుయువత అధ్యక్షుడు కండాపు శ్రీనివాసరావు ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో మాట్లాడి కొత్తగా అంచనాలు తయారు చేసి అదనంగా పైప్‌లైన్ వేశారు. ఈ పనులను ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ సుబ్బలక్ష్మి, జెఇ రాజులు పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పలాసను జిల్లాగా ప్రకటించాలి

ప్రజాశక్తి- పలాస

శ్రీధర్

పలాసను జిల్లాగా ప్రకటించాలని జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్ అన్నారు. ఈ మేరకు సోమవారం బహిరంగ లేఖ విడుదల చేశారు. అభివృద్ధి, వికేంద్రీకరణ, ప్రజలకు పరిపాలన దగ్గర చేయాలనే ఉద్దేశంతో 13 జిల్లాలను 29 జిల్లాలుగా విభజించారని అన్నారు. ఇది తప్పు కాదని, ప్రజలకు సౌలభ్యం, సమాన హక్కులు, అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో తీసుకున్న నిర్ణయమేనని అన్నారు. వెనుకబడిన జిల్లా శ్రీకాకుళానికి ఒకటిగా ఉంచడం న్యాయం కాదన్నారు. ముందుగా ప్రకటించినట్టుగా పలాసను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్రం నుంచి రెండు వాటాలు, రాష్ట్రం నుంచి కూడా సమాన నిధులు లభిస్తాయని అన్నారు. దీంతో వెనుకబాటుతనం తొలగుతుందన్నారు. ఉద్దాన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, యువత ఉద్యోగాల కోసం వలస వెళ్లాల్సిన పని ఉండదని అన్నారు.

వేణుగోపాల్ చేతుల మీదుగా మెమొంటో అందుకుంటున్న ఢిల్లేశ్వరి

కెరీర్ ఫెస్ట్‌లో మొదటిస్థానంలో ఢిల్లేశ్వరి

ప్రజాశక్తి- లావేరు

జిల్లాలో సమగ్ర శిక్షణ నిర్వహించిన కెరీర్ ఫెస్ట్ ఈవెంట్‌లో చార్ట్ మేకింగ్ ప్రిపరేషన్ విభాగంలో మురపాక కెజిబివి పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కె.ఢిల్లేశ్వరి జిల్లాలో మొదటి స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినికి సమగ్రశిక్ష ఎపిసి పప్పల వేణుగోపాల్ చేతులమీదుగా మెమొంటో, ప్రశాంసాపత్రాన్ని అందుకుంది. విద్యార్థినిని పలువురు అధికారులు, పాఠశాల ప్రిన్సిపాల్ బల్ల సుధ, ఉపాధ్యాయులు అభినందించారు. ఇదే స్ఫూర్తితో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ముందుకు సాగాలని సుధ అన్నారు.

జనరేటర్‌ను పరిశీలిస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

జనరేటర్ ఏర్పాటు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి, డైయాలసిస్ కేంద్రంలో ఎలక్ట్రికల్ పవర్ జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. దీనిని సీడాప్ మాజీ ఛైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, కౌన్సిలర్ పిలక విజయ్‌కుమార్‌రెడ్డిలు సోమవారం పరిశీలించారు. దీనికోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించారని తెలిపారు. దీనివల్ల రోగులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని అన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి

లావేరు : విగ్రహావిష్కరణ చేస్తున్న ఉపాధ్యాయులు

పొందూరు : గణిత ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్

ప్రజాశక్తి- లావేరు

లావేరు మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న గణిత ఉపాధ్యాయులు కోట్ల సూర్యనారాయణ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం శ్రీనివాస రామానుజన్ విగ్రహాన్ని పాఠశాల ఆవరణలో నెలకొల్పగా హెచ్‌ఎం పసుపుల జగన్నాధరావు విగ్రహావిష్కరణ చేశారు. అనంతరం రామానుజన్ విగ్రహానికి పూలమాలతో సత్కరించి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ అపారమైన మేధస్సుతో భారత దేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మహాగణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ అని కొనియాడారు. గణిత ఉపాధ్యాయులు సూర్యనారాయణ మాట్లాడుతూ సంఖ్యా సిద్ధాంతం, అనంత శ్రేణులు నిరంతర భిన్నాలపై కృషిచేసిన మహనీయుడని ప్రశంసించారు. జాతీయ గణిత దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు పసుపుల జగన్నాథం, కోట్ల సూర్యనారాయణ, పక్కి శ్రీనివాసరావులను ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ అధ్యక్షులు పిసిని వసంతరావు, అరసవెల్లి వరలక్ష్మి, కూన నారాయణ బాబు, సంజీవని నళిని సుధాకర్, శివ్వాల పుణ్యావతి, సింగంశెట్టి దేవి, వంబర సూర్య నాగరాజు, జుత్త శ్రీదేవి, జర్జన సుదర్శనం, జల్లేపల్లి శోభారాణి, సూర సత్యవతి, మురపాక శైలజ, కామేశ్వరరావు, నాగార్జున, చిదంబరేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరసవల్లి: స్థానిక అరసవల్లి కూడలిలో ఉన్న 'శర్వాణి విద్యాలయం'లో గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ 138వ జయంతి నిర్వహించారు. అందవరపు సూరిబాబు, పాఠశాల ప్రిన్సిపాల్ డా. కె.రేఖ రామానుజన్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా మేథ్స్ క్విజ్ నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు డి. రవి, కె.త్రినాధ్, ఎ.దీరమణి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం : విద్యార్థులకు గణితంపైన ఆసక్తి కలిగించుటకు ఈ గణిత దశావధానం దోహద పడుతుందని ప్రిన్సిపాల్ అంపోలు కామేశ్వరరావు అన్నారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా శ్రీసాయి జూనియర్ కళాశాల ఆవరణలో 278వ గణిత దశావధానం కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. కంచిలి మండలం బూరగాంకు చెందిన గణిత అవధాని మడ్డు తిరుపతిరావు మాస్టర్ హాజరై గణితంలో వివిధ అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎఇ రెడ్డి శ్రీనివాసరావు, మేథ్స్ అధ్యాపకులు ఎస్.భాస్కరరావు, ఎం.అప్పల సూర్యనారాయణ, ఎస్.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, బద్రి శ్రీనివాసరావు, జి.మోహనరావు, ఇందిరా ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని పలు ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో సోమవారం గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఎపి మోడల్‌స్కూల్‌లో గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన పలు గణిత ప్రాజెక్టులను ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్ పరిశీలించారు. ఈయనతో పాటు గణిత ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, భవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే శ్రీవేద పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు రహణి, రాజేశ్వరి, వెంకటరమణ, రామకృష్ణల ఆధ్వర్యంలో గణిత దినోత్సవం జరిపారు. అలాగే రామానుజన్ టెస్టులో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బోడ బాబూరావు, ప్రిన్సిపాల్ నల్లా రామకృష్ణ, సునీత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస : గణిత మేథావి రామానుజన్ జయంతి సందర్భంగా జాతీయ గణిత దినోత్సవాన్ని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. రామానుజన్, లక్కోజీ సంజీవరాయ శర్మల చిత్రపటాలకు ఎంఇఒ కె.ఎ.రాములు, టంకాల శ్రీనివాసరావు, నర్సింహమూర్తి, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, గణిత ఉపాధ్యాయులు షేక్ షావలి, తాండ్ర చంద్రమనోహర్, ఎస్.అరుణ, ఉపాధ్యాయులు కోట ఈశ్వరరావు, ఎంవిఆర్ భట్లు, బి.శరత్‌కుమారి, ఉమాకుమారి, జి.కుమారి, సులోచన రాణి, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పలాస : బాల్యం నుంచే పోటీతత్వం అలవర్చుకోవాలని ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పీరుకట్ల విఠల్‌రావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్ల మోడల్ ప్రైమరీ స్కూల్‌లో గణిత శాస్త్ర వేత్త శ్రీనివాస్ రామానుజన్ దినోత్సవం వేడుకల్లో పాల్గొనారు. అనంతరం క్లస్టర్ స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దువ్వాడ శ్రీహర్ష నాయుడు, స్కూల్ కమిటీ ఛైర్మన్ మోహనరావు, ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ కమిటీ సభ్యులు వడ్డి యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాలు పాల్గొన్నారు అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

అలాగే మండలంలోని తాళ్లభద్రలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు మాదిన విద్యాసాగర్, నగరి లక్ష్మి, కె.మాధవి, లత, జయప్రద, శ్రీదేవి, లోకనాథం, హైమావతి, శంకరరావు, వేదవతి, సాహితీ ధనలక్ష్మి పాల్గొన్నారు.

టెక్కలి : గణిత దినోత్సవం సందర్భంగా స్థానిక అమ్మఒడి పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన గణిత ప్రాజెక్టులు పలువురుని ఆలోచింపజేశాయి. పాఠశాల కరస్పాండెంట్ బరాటం శ్రీనివాసరావు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు మూల తాతయ్య చిన్నారులు వేసినజ ప్రాజెక్టులను తిలకించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్‌కుమార్, ఇన్‌ఛార్జి పుష్పలత, గణిత ఉపాధ్యాయులు ప్రసాద్, దుర్గారాణి పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఒక్లాండ్ పాఠశాలలో ప్రిన్సిపాల్ మళ్లా మధులత ఆధ్వర్యాన నిర్వహించిన గణిత దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పలు ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శన చేపట్టారు. స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. రాజాం డిగ్రీ కళాశాల నుంచి హజరైన ఎల్.వెంకటరమణను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, ఇన్‌ఛార్జి సి.నాగేశ్వరరావు, డాక్టర్ ఎస్.లక్ష్మణరావు, వై.రమేష్, రాంబాబు, నూకరాజు పాల్గొనారు. బూరగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు పూజారి హరిప్రసన్న ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు బసవల లోకనాథం, ఉమేష్‌కుమార్, రోజారమణి పాల్గొన్నారు.

నరసన్నపేట: నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్రం దినోత్సవ సందర్భంగా శ్రీనివాస్ రామానుజన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ పి.లత పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం విద్యార్థులకు గణిత శాస్త్ర ప్రాధాన్యత అంశాలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శాంతిహేమ, అధ్యాపకులు అన్నాజీరావు, త్రినాథరావు, ఢిల్లీశ్వరరావు, నాగరాజు, కృష్ణవేణి, తేజేశ్వరి, పవిత్ర పాల్గొన్నారు.

అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నరసన్నపేట ప్రిన్సిపాల్ పవన్ మరపట్ల శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా మేథ్స్ డే వేడుకలు నిర్వహించారు. గణిత అధ్యాపకులు మెండ లక్ష్మీనారాయణ రామానుజన్ జీవితంలోని ముఖ్య ఘట్టాలను విద్యార్థులకు వివరించారు.

మందస : మందస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంబుగాం ప్రధానోపాధ్యాయులు కాసం శ్రీనివాసరావు రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. విద్యార్థులతో ఏర్పడ్డ రామానుజన్ సంఖ్య 1729 ఆకృతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉపాధ్యాయులు దాసరి ఈశ్వరరావు, జి.సాయమ్మ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిషత్ ప్రాథమిక మోడల్ పాఠశాల వసుంధరలో రామానుజన్ చిత్రపటానికి సర్పంచ్ సలాన అప్పలనాయుడు, ఎంఇఒ మల్లారెడ్డి పద్మనాభరావు, ప్రధానోపాధ్యాయులు పారిసెల్లి రాజారావు రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సలాన జయమ్మ, బుద్ధుల లలితకుమారి, యాల్ల భాస్కరరావు, విద్యా కమిటీ ఛైర్‌పర్సన్ సలాన ఫాల్గుణరావు, విశ్రాంత ఉపాధ్యాయులు సలాన గిరిధర్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రభుత్వ జూనియర్ బాలురు కళాశాలలో ప్రిన్సిపాల్ చింతాడ శరత్‌బాబు అధ్యక్షతన గణిత అధ్యాపకులు పైడి సురేష్‌కుమార్ గణిత దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నల్లాన రమేష్, బోరుభద్ర సురేష్‌కుమార్, నూకల రాజశేఖర్ పాల్గొన్నారు.

కవిటి : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల్లో గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

కోటబొమ్మాళి: భారతదేశ పేరు ప్రతిష్టలు, గణిత ఖ్యాతిని ప్రపంచ దేశాలకు తెలియజేసిన ఘనత శ్రీనివాస రామానుజన్‌దేనని బ్లూమింగ్ బడ్స్ ప్రిన్సిపాల్ డబ్బీరు దుర్గాప్రసాద్ అన్నారు. శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాలర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, తదితర పోటీలను నిర్వహించి, గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే అదిత్య పాఠశాలలో విద్యార్థులు గణిత సంఖ్యలు కూర్చోని అకట్టుకున్నారు.

టెక్కలి : చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న 'అమ్మఒడి' సిబ్బంది

కోటబొమ్మాళి : గణితం ఆకారంలో కూర్చొన్న అదిత్య పాఠశాల విద్యార్థులు

నరసన్నపేట : స్థానిక విజ్ఞాన భారతిలో గణిత ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఇఒ బంకుపల్లి చంద్రశేఖరం, విశిష్ట అతిథిగా విశ్రాంత ఇంజినీర్ కె.వైకుంఠ రావు, మడ్డు తిరుపతిరావు, విశాఖ భారతీయ విద్యా కేంద్రం అధికారులు కె.ఎ.వి.కృష్ణమాచార్యులు, డి. రమణమూర్తి, నానాజీ, కరస్పాండెంట్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

పలాస : పలాస జూనియర్ కళాశాలలో గణిత దినోత్సవం సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం గణిత అధ్యాపకులు బి.ప్రవీణ్‌కుమార్‌ను సన్మానించారు. కార్యక్ర మంలో అధ్యాపకులు హెచ్.రామ్మోహన్‌దొర, ఎస్.రామకృష్ణ, ఎస్.యుగంధర్, టి.వాసుదేవరావు, ఎస్. జయప్రకాష్, టి.పాపా రావు, బి.ప్రసాదరావు, తపన్‌కుమార్ జెన్నా పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని పల్లిసారథి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణిత దినోత్సవంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు గుంట కోదండరావు, ఉపాధ్యాయులు బి.అన్నపూర్ణ, ఎం.హరనాథ్, ఎం.జయప్రద, ఆర్.స్వర్ణలత, ఎస్.ప్రశాంతి, ఎస్.సీతమ్మ, కె.నాగభూషణ్, టి.శివాజీ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలోని ఐతమ్ ఇంజినీరింగ్ కళాశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు డాక్టర్లు రత్నమణి, రమణయ్య, శాంతికుమార్, గణిత అధ్యాపకులు పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని లఖిదాసుపురం ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు, గణిత ఉపాధ్యాయులు కురమాన దాలయ్య ఆధ్వర్యాన గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

చిన్నారుల మృతి నేపథ్యంలో కమిషనర్ తనిఖీ

- పుష్కరిణి 3 ద్వారాలు మూసివేతకు ఆదేశాలు
- ప్రధాన గేట్లు మాత్రమే తెరిచి ఉంచాలని సూచన

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలోని అయ్యప్పస్వామి దేవాలయం ఎదుట ఉన్న రామలింగేశ్వర పుర్కరణిలో ఆదివారం ఇద్దరు చిన్నారులు జారిపడి మృతి చెందిన నేపథ్యంలో సోమవారం పురపాలక సంఘ కమిషనర్ తమ్మినేని రవి, టౌన్ ప్లానింగ్ ఇంజినీరింగ్ పబ్లిక్ విభాగాల సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రజల భద్రత దృష్ట్యా ప్రధాన గేట్లు మాత్రమే తెరిచి ఉంచి మిగిలిన మూడు ద్వారాలను వెంటనే మూసివేయాలని అయ్యప్పస్వామి ఆలయ అర్చకులకు సూచించారు. భవిష్యత్‌లో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా వాచ్‌మేన్ నియామకానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. అనంతరం జగ్గుశాస్త్రులపేట ప్రాంతంలో ఉన్న ఎపి టిడ్కో గృహాల సమీపంలో ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ కోరిన మేరకు 50 సెంట్లు స్థలాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. అందుబాటులో ఉన్న అనువైన స్థలాన్ని పరిశీలించిన అనంతరం సదరు భూమిని ఎస్ఇ ఎపిఇపిడిసిఎల్ శ్రీకాకుళం వారికి సబ్‌స్టేషన్ నిర్మాణం నిమిత్తం అప్పగించనున్నట్టు తెలిపారు.

చిన్నారుల కుటుంబాలను ఆదుకుంటాం

పట్టణంలోని రామలింగేశ్వర పుష్కరిణిలో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందిన చిన్నారుల కుటుంబాలను ఎమ్మెల్యే రవికుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని జిల్లా టిడిపి పార్లమెంటరీ అధ్యక్షులు మొదలవలస రమేష్ అన్నారు. సోమవారం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రిలో చిన్నారులు ధనుష్, పవన్‌ల మృతదేహాలను సందర్శించి వైద్యాధికారులతో మాట్లాడి పోస్టుమార్టం ప్రక్రియను పూర్తి చేయించారు. అనంతరం చిన్నారుల తండ్రులు నాగరాజు, సుదర్శన్‌రావులను ఓదార్చి సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు అవసరమైన చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రాంబాబు, ఎస్ఐ బాలరాజుతో మాట్లాడి మృతుల కుటుంబాలకు సహాయ సహకారాలు అందేలా సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని కోరారు. ఈయనతో పాటిన రమణమూర్తి ఉన్నారు.

రామలింగేశ్వర పుష్కరిణి పరిశీలిస్తున్న కమిషనర్ రవి

వ్యక్తికి గాయాలు

బూర్జ: ఆర్‌టిసి బస్సు వెనుక భాగం తగిలి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉప్పినివలస గ్రామానికి చెందిన గొల్లపల్లి గోవిందరావు అనే వ్యక్తి మండలం లచ్చయ్యపేట గ్రామ జంక్షన్ రోడ్డుపక్కన ఉన్న బల్లపై మద్యం సేవించి పడుకున్న సమయంలో పాలకొండ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు లచ్చయ్యపేట జంక్షన్ వద్దకు వచ్చేసరికి పడుకొని లేచిన గోవిందరావు ఆర్‌టిసి బస్సు దగ్గరికి వచ్చేసరికి బస్సువెనక భాగం తగలడంతో గోవిందరావు కాలుకు గాయాల య్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. గాయపడ్డ గోవింద రావును శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

వివరాలు తెలియజేస్తున్న డిఎస్‌పి వివేకానంద

చోరీ సొత్తు స్వాధీనం

శ్రీకాకుళం సిటీ: జిల్లాలో బంగారు ఆభరణాలు, మూడు మోటార్ సైకిళ్ల చోరీతో సంబంధం ఉన్న నేరస్తుడిని అరెస్టు చేసి ఐదుతులాల బంగారం, ఒక బైక్ రికవరీ చేసినట్లు శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్ వివేకానంద చెప్పారు. డిఎస్‌పి కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించిన వివరాలు వెల్లడించారు. ఎచ్చెర్లలో 2024 జూన్ 16న రామనగర్ ప్రాంతానికి చెందిన మహిళ నేతింటి సూరమ్మ పోలం నుంచి వస్తుండగా, రోడ్డుపై నిల్చున్న అజ్ఞాత వ్యక్తి మెడలో పుస్తెలతాడు తెంచే ప్రయత్నం చేశాడు. ఆమె ప్రతిఘటించటంతో బలవంతగా నెట్టి తాడుతో పారిపోగా, పుస్తెలు ఆమె చేతిలో ఉండిపోయాయి. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పాత నేరస్తులు కదలికలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పోలీసులు నింది తుడిని పట్టుకున్నారు. చిలకపాలెం వద్ద నిందితుడిని సోమవారం పోలీసులు పట్టుకిని అరెస్టు చేశారు. నిందితుడు ఒడిశా రాష్ట్రం గంజాయి జిల్లా లోచపాడ గ్రామంకు చెందిన రావుల వినోద్‌గా డిఎస్‌పి తెలిపారు. స్నేహితులతో కలిసి పలు దొంగతనాలు చేశాడు. ఎచ్చెర్ల, నందిగాం, అనకాపల్లి జిల్లా కశింకోట ప్రాంతాల్లో పలు చోరీలు చేశాడు. కడప జిల్లాలో సైతం ఈ నేరస్తుడు పలు చోరీలు చేశాడు. ఎస్‌పి కె.వి మహేశ్వరరెడ్డి ప్రత్యేకంగా దర్యాప్తులో పాల్గొన్న వారిని అభినందించినట్లు డిఎస్‌పి తెలిపారు. సమావేశంలో జెఆర్‌పురం సిఐ ఎం.అవ తారం, ఎస్ఐ జి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పలాస : పలాస-పూండి రైల్వే స్టేషన్ మధ్యలో సోమవారం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారని జిఆర్‌పి ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు తెలిపారు. మృతుడి కుడి చేతిపై రాజు అనే పేరుతో లవ్ సింబల్, ఇత్తడి ఉంగరం ఉందని అన్నారు. బ్లూ చెక్స్ ఫుట్ హ్యాండ్ షర్ట్, బ్యాక్ రంగు ప్యాంటు, తెలుపు కట్‌లో బనియన్ వేసుకున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమాస్టం నిమిత్తం పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. వివరాలకు 9440627567, 9492250069 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కిడ్నీ వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలి

టెక్కలి : మండలంలోని ముఖలింగాపురం పంచాయతీ పాలసింగిలో వ్యాప్తి చెందుతున్న కిడ్నీ వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని ఎపి దళిత మహాసభ జిల్లా అధ్యక్షులు బోకర నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశానని అన్నారు. గతంలో ఎన్నడులేని విధంగా గ్రామంలో వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని అన్నారు. ఇప్పటికే పలువురు మృతి చెందారని తెలిపారు. మరికొంత మంది వ్యాధితో పోరాడుతూ డయాలసిస్ చేయించు కుంటున్నారని అన్నారు.

'స్వామిత్ర'పై అవగాహన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రభుత్వం చేపట్టిన స్వామిత్ర కార్యక్రమాన్ని మెళియాపుట్టి మండల కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో 'ప్రతి ఆస్తికీ గుర్తింపు-ప్రతి కుటుంబానికీ గౌరవం' అనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయం కార్యదర్శి శిష్టు, కిషోర్‌కుమార్, సర్పంచ్ ప్రతినిధి రేఖాన. వాసు, టిడిపి మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ అనపాన రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కోటిపల్లి పంచాయతీ పరిధిలోని మజ్జిలిపేట, కోటిపల్లి గ్రామాల్లో ఎంతో కాలంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామానికి చెందిన శ్రీధర్మశాస్త్ర సేవా సంఘం అధ్యక్షులు గురుగుబెల్లి విష్ణుమూర్తి, గ్రామ యువకులు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. పంచాయతీ పరిధిలో అసంపూర్తిగా వదిలేసిన జలజీవన్ మిషన్ పనులు పూర్తిచేసి ఇంటింటికీ తాగునీరు అందించుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మజ్జిలిపేటలోని మర్రిచెట్టు నుంచి నారాయణపురం కుడికాలువ వరకూ సిసి కాలువ నిర్మాణం చేపట్టాలని, కోటిపల్లి, మజ్జిలిపేట గ్రామాల స్మశానాలకు రక్షణగోడ, షెడ్లు నిర్మాణం, రహదారి నిర్మాణం, తాగునీటి కల్పన చేయాలని గ్రీవెన్స్‌లో కోరారు.

గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న సంఘం అధ్యక్షులు విష్ణుమూర్తి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహాసభలు జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- రణస్థలం

డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో ఐదురోజుల పాటు జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. జనవరి 4న మధ్యాహ్నం 2 గంటలకు విశాఖపట్నం ఆర్‌టిసి బస్టాండ్ నుంచి ప్రదర్శన అనంతరం ఆర్‌కె బీచ్ వద్ద జరిగే భారీ బహిరంగ సభలో యావన్మంది కార్మికవర్గం పాల్గొనాలని కోరారు. మహాసభలు జయప్రదానికి శ్యాంపిస్టన్స్ ప్లాంట్-2 పరిశ్రమ వద్ద సిఐటియు అఖిల భారత మహాసభలు పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కోటిమంది సభ్యులున్న అతి పెద్ద కార్మిక సంఘం సిఐటియు అని, ఐక్యత పోరాటం నినాదంతో కార్మికహక్కులు కొరకు నిరంతరం పోరాడుతుందన్నారు. కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మికవర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందన్నారు. కార్మిక హక్కులను కార్పొరేట్ల ప్రయోజనాల కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. కార్యక్రమంలో శ్యాంక్రగ్ పిస్టన్స్ అండ్ రింగ్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.అప్పలనర్సయ్య, గొర్లె.కిరణ్, నాయకులు జయరాము, గురు ఈశ్వరరావు, కె.భోగేష్, ఆర్.ఎస్. నాయుడు, నాగేశ్వరరావు, రమణ, తోటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే కలల సాకారం

సినీ హీరో నారాయణమూర్తి

వజ్రపుకొత్తూరు: విద్యతోనే కన్న కలలు సాకారమవుతాయని సినీ హీరో, డైరెక్టర్ ఆర్.నారాయణమూర్తి అన్నారు. మండలంలోని సాయివినీత్ విద్యా సంస్థను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోనసీమలాంటి ప్రశాంత వాతావరణం కలిగిన ఇక్కడ విద్యార్థులందరూ చక్కగా చదువుకుని వైవిధ్యమైన విజ్ఞానాన్ని పొంది అన్ని రంగాల్లో శాసించే స్థాయికి ఎదగాలని అన్నారు. డ్రగ్స్, గంజాయి, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. సమాజంలో మంచిస్థానంలో మనం నిలబడాలంటే మన వ్యక్తిత్వం అనేది బాగుండాలని తెలిపారు. ఉద్దాన ప్రాంతంలో విశాలమైన ప్రాంగణంలో విలువలతో కూడిన విద్యను అందిస్తున్న సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ లీలా కోదండరావులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అన్యపు కైలాసరావు, అధ్యాపకులు బత్తిన శ్రీనివాసరావు, రవి, సాయి గోపాల్ పాల్గొన్నారు.

అధ్యాపకులతో నారాయణమూర్తి

సాంస్కృతిక పోరాట యోధుడు సుబ్బారావు

పలాస: తను రాసిన ప్రతి పాటా విశ్వం ఉన్నంత వరకు శాశ్వతమని, ఒక్క చేతితో పెన్ను, మరో చేతితో గన్ పట్టి రాష్ట్ర నలుమూలా తిరిగి ఉగ్రూతలూగించిన మహా కళాకారుడు సుబ్బారావు పాణిగ్రహి అని ప్రజాకళా మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొర్రాయి నీలకంఠం, అరసవల్లి కృష్ణ, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ సీనియర్ నాయకులు మద్దిన మల్లేశ్వరరావు, పిఒడబ్ల్యు జిల్లా నాయకులు పోతనపల్లి కుసుమ, జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, ప్రజా కళామండలి కోటి కొనియాడారు. మండలంలోని బొడ్డపాడులో సోమవారం సుబ్బారావు పాణిగ్రహి 56వ ర్థంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్బారావు జీవిత చరిత్రను ప్రస్తుత రాజరీయలను జోడించి భవిష్యత్ కార్యాచరణ చేసుకుని ఫాసిస్టు ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కార్యదర్శి చింతాడ కృష్ణమూర్తి, కుల నిర్మూలన పోరాట సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్కర కృష్ణయ్య, డిటిఎఫ్ నాయకులు ధర్మారావు మాస్టారు, పుచ్చ దుర్యోధన పాల్గొన్నారు. ప్రజా కళామండలి చంద్రన్న, రంగం కళా బృందం కోనారి సూదన, దయ్‌భాస్కర్ బృందం, జన సాం స్కృతిక కళా మండలి కళాబృందాలతో గానాలాపన చేశారు.

గానాలాపన చేస్తున్న కళా బృందం

వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఆలయ భూముల పరిరక్షణకు వినతి

ప్రజాశక్తి- కవిటి

కొజ్జిరియా పంచాయతీ పరిధిలో జగన్నాథస్వామి ఆలయానికి సంబంధించిన భూములను పరిరక్షించాలని కోరుతూ తహశీల్దార్ మురళీమోహనరావుకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. ఎండోమెంట్ రికార్డుల ప్రకారం ఆలయానికి చెందిన 32 ఎకరాల భూముల్లో భాగమైన ఎల్‌పిఎం 1682, 1956, 1957 నంబర్లలోని 2.8 ఎకరాల భూమిని సర్వే చేసి హద్దులు నిర్ధారించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ గువ్వాడ గణపతి, కూటమి నాయకుడు పనపాన లింగరాజు మాట్లాడుతూ 2.8 ఎకరాల్లో కేవలం 1.75 ఎకరాలే ఆలయం పేరిట ఉండగా, మిగిలిన 1.05 ఎకరాలు ఇతరుల పేర్లపై ఉన్నాయని తెలిపారు. పాత రికార్డుల ఆధారంగా సమగ్ర విచారణ చేపట్టి ఆలయ భూములను ఎండోమెంట్ శాఖ రికార్డుల్లో చేర్చి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్‌పి తదితరులు

ఇస్కఫ్ కేలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

'ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కో-ఆపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్' (ఇస్కఫ్) 2026 కేలండర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి.మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తితో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఆవిష్కరించారు. ఇస్కఫ్ జిల్లా అధ్యక్షులు బి.వి.ఎస్.ఎన్ రాజు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎస్.వి లక్ష్మణమూర్తి, ఆర్‌డిఒ కె.సాయిప్రత్యూష, డిఎస్‌పిలు సిహెచ్.వివేకానంద, డి.లక్ష్మణరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి డి.మధుసూదనరావు, ఇస్కఫ్ రాష్ట్ర సభ్యులు ఎం.వి మల్లేశ్వరరావు, జిల్లా ప్రతినిధులు సీపాన రామారావు, నాగభూషణరావు ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పాక్స్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షునిగా పాపినాయుడు

ప్రజాశక్తి- పొందూరు

పాపినాయుడు

శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఉద్యోగుల సంఘం (పాక్స్) నూతన అధ్యక్షుడుగా పొందూరు పిఎసిఎస్ సిఇఒ ఎర్నేన పాపినాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం శ్రీకాకుళంలోని అరసవెల్లిలో జరిగిన నూతన కార్యవర్గం ఎన్నిక కార్యక్రమంలో ఈయనను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడుగా ఎన్నికైన పాపినాయుడుకు పొందూరు పిఎసిఎస్ చైర్మన్ వండాన మురళీ, డైరెక్టర్లు దుంపల సత్యం, కె.వెంకట రమణ, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకట సత్యనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్, కూటమి నాయకులు బాడాన శేషగిరి, బలగ శంకర భాస్కరరావు, కొంచాడ చిన్నంనాయుడు, సీపాన శ్రీరంగనాయకులు, కిల్లాన భాస్కరరావు, తదితరులు అభినందనలు తెలిపారు.

రైతులతో రెడ్డీస్ ప్రతినిధులు

దుక్కి దున్నకుండా మొక్కజొన్న సాగు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని గుమడాం పంచాయతీ వాళ్లేపేట గ్రామ రైతులు గత మూడేళ్లుగా డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కజొన్న యాంత్రీకరణ పద్ధతి ద్వారా సాగు చేస్తున్నారు. ఈ సందర్భంగా రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటి నాయుడు మాట్లాడుతూ డబుల్‌వీల్ మార్కర్ ద్వారా మొక్కజొన్న సాగు తక్కువ ఖర్చుతో దిగుబడి సాధించవచ్చని, కూలీల కొరత కూడా తగ్గించవచ్చన్నారు. పది రోజుల ఉందుగానే పంట చేతికి అందుతుందని, రూ.5వేలు వరకు ఖర్చు తగ్గుతూ నీటిని ఆదా చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయ కర్తలు వైశ్యరాజు వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

విఠల్‌రావుకు సన్మానం

సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

పలాస : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావును టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది సోమవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఎమ్మెల్యే గౌతు శిరీష గెలుపునకు సహాయ సహకారాలు అందించడంతో పాటు టిడిపి అభివృద్ధికి కృషి చేస్తున్నందుకు పదవులు ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బూరెల విజయ, కృష్ణంరాజు, ధనుంజయ, కె.కామరాజు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు

ప్రభుత్వ విప్ అశోక్

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విప్ అశోక్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

నియోజకవర్గంలో అన్ని అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని మండపల్లిలో రూ.16 లక్షలతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. సిడిపిఒ రాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాలు సక్రమంగా పిల్లలకు అందివ్వాలన్నారు. ప్రోటోకాల్ పేరిట అధికారులను బెదిరిస్తున్న సర్పంచ్ గత వైసిపి ఐదేళ్లలో ఎప్పుడైనా ప్రోటోకాల్ పాటించారా? అని ప్రశ్నించారు. ఈ పంచాయతీలో రూ.88 లక్షల నిధులు దుర్వినియోగం కావడంతో ఇద్దరు కార్యదర్శులను ప్రభుత్వం సస్పెండ్ చేసిందన్నారు. పనులు చేయకుండా డ్రా చేసిన డబ్బులను రికవరీ చేశామన్నారు. భీమసముద్రం గెడ్డపై బ్రిడ్జి నిర్మాణానికి అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇటీవల ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షించి అంచనాలు కూడా వేశామన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. బుడ్డెపుపేటలో అంగన్వాడీ భవన నిర్మాణానికి ఎంపిటిసి పాతిర్ల చంద్రశేఖరెడ్డి తన సొంత డబ్బులు రూ.3.5 లక్షలు పెట్టి సగం నిర్మించారన్నారు. కాగా, మిగిలిన భవన పనులు కూడా తన సొంత డబ్బులతో పూర్తిచేస్తామని సభాముఖంగా చెప్పడం శుభపరిణామమని అన్నారు. తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. జలజీవన్ మిసన్‌కు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. త్వరలో పనులు కూడా ప్రారంభమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రభాకరరావు, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ కొండా శంకర్‌రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షులు పెద్దిని బాబ్జీ, డిటి సంతోష్‌కుమార్, టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.పద్మనాభం, డి.కామేష్, నాయకులు డి.ఢిల్లీరావు, ఎం.సూర్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, సహదేవ్, అనిల్, గోపి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న భానోజీనాయుడు

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని రణస్థలంలో ఇటీవల స్వర్గస్తులైన తలారి చిన్నయ్య కుటుంబాన్ని ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు సోమవారం పరామర్శించి ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలారి చిన్నయ్య ఎన్నోఏళ్లుగా పంచాయతీకి ఉత్తమ సేవలందించి ప్రజల మనసును గెలుచుకున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ప్రతినిధి మజ్జి వెంకట రమణ, మేస్త్రి రమణ, శంకర్, సీతారాం, కుప్పలు కేశవ, కుప్పిలి లక్ష్మణ, కుప్పిలి అప్పారావు, కుప్పిలి రాంబాబు, రమేష్, గొల్ల, సురేష్, గురువులు, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అప్రమత్తం

ర్యాలీలో పాల్గొన్న వెంకటాచలం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

డిజిటల్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వినియోగదారులకు క్లబ్బులు మాస్టర్ ట్రైనర్ ఎల్.వెంకటాచలం అన్నారు. మండలంలోని కరజాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యాన విద్యార్థులు, ఉపాధ్యాయులతో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రధానోపాధ్యాయులు టి.వి.రమణమూర్తి ప్రారంభించారు. గ్రామ వీధుల్లో సైకిల్‌పై వినియోగదారులను చైతన్యం చేసే పకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.శ్రీరాములు, టి.గోపాలకృష్ణ, సిహెచ్.ఆదినారాయణ, పి.రామారావు, డి.దీనబంధు, జగదీష్, సింహాచలం, కిరణ్, నారాయణరావు, ప్రమీల పాల్గొన్నారు.

పలాస : డిజిటల్ చెల్లింపుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య ఆధ్వర్యాన అవగాహనా సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డి.ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి, లయన్స్ పూర్వ అధ్యక్షులు హెచ్.వై.దొర, ఎంఇఒ శ్రీఇనవాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొండల మధుబాబు, అధ్యాపకులు బి.ప్రసాదరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి జూనియర్ ఫెన్సింగ్ పోటీలు

హాజరైన క్రీడాకారులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలోని శ్రీ ఫంక్షన్ హాల్‌లో జిల్లాస్థాయి జూనియర్ ఫెన్సింగ్ పోటీలు సోమవారం ఉత్సాహంగా సాగాయి. 13 నుంచి 19 ఏళ్ల మధ్య వయసు గల బాలబాలికలకు వేర్వేరుగా జరిగిన ఈ పోటీల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఫెన్సింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. జిల్లా స్థాయి పోటీలను ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బలభద్రుని రాజా, అసోసియేషన్ ప్రతినిధులు వైశ్యరాజు మోహన్, ఎం.సుధీర్‌వర్మ తదితరులతో కలిసి ప్రారంభించారు. ఎన్ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీ ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహ రించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు బలభద్రుని రాజా మాట్లాడుతూ జిల్లాలో ప్రతిభ చూపిన ఫెన్సింగ్ క్రీడాకారులు ఈ నెల 26 నుంచి 27 వరకూ విజయవాడలో జరుగనున్న రాష్ట్ర స్థాయి జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా ఫెన్సింగ్ క్రీడాకారులు సత్తాచాటాలని, పతకాలు సాధించి విజేతలుగా తిరిగిరావాలని ఆకాంక్షించారు. ఈ పోటీల ఎంపికలో పీడీ, పిఇటి, కోచ్‌లు డి.భవానీ, అనితశ్రీ, యశోద, రాహుల్, హేమంత్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

మండల పరిధిలోని ఆచార్య ఎన్‌జిరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ అంతర్ కళాశాల పోటీలు సందర్భంగా ఎస్ఎస్ఆర్ పురం కింజరాపు ఎర్రన్నాయుడు వ్యవసాయ కళాశాల విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా యాజమాన్య సిబ్బంది, ఆసీస్‌రెడ్డి, ఎల్.నారాయణ నాయుడు విద్యార్థులను అభినందించారు. జావలిన్ త్రో, డిస్కస్‌త్రో, స్పాట్ పెయింటింగ్, డిబేట్, డాన్స్ విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో యాజమాన్య సభ్యులు బుడుమూరు శ్రీరామ్మూర్తి, బివిఎస్ఎన్ మూర్తి, ఇప్పిలి కిషోర్, దుర్గా శ్రీనివాస్, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎల్.నారన్నాయుడు పాల్గొన్నారు.

ఎపి మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని ఈదులవలస ఎపి మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ ఎంపికలు నిర్వహించామన్నారు. అందులో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని అన్నారు. రెండు కిలోమీటర్ల క్రాస్ కంట్రీలో పి.ఝాన్సీ, ద్వితీయస్థానంలో కె.భరత్‌కుమార్ విజయం సాధించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎం.నీలం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపికైన జిల్లా జట్టు

జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి

ఈ నెల 27న తూర్పుగోదావరి జిల్లా రావులపాలంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లాజట్టు సోమవారం ఎంపికయ్యారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో చేపట్టిన ఎంపికలను ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ చేపట్టారు. జిల్లా నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరు కాగా, పురుషులు, మహిళల జట్టులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఎంపికైన జట్టుని ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ అభినందించారు. కార్యక్రమంలో నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.వైకుంఠరావు, బాడాన నారాయణరావులు పర్యవేక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె.రామిరెడ్డి, జగ్గమ్మ, ఆదిశేషు, లక్ష్మణరాజా, కాపల రఘునాథరావు, బసవరాజు, పాండవుల జగదీష్, శైలజ, ప్రశాంతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఎం ప్రసాదరావు

మహిళా పథకాలపై అవగాహన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలపై అవగాహన కలిగి ఉండాలని సెర్ప్ ఎపిఎం గొడబ ప్రసాదరావు అనానరు. మండల మహిళా సమైక్య కార్యాలయంలో కమ్యూనిటీ రిసోర్స్‌పర్సన్ల ఎంపిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 సంఘాల కంటే తక్కువగా ఉన్న గ్రామ సంఘాలతో 10 సంఘాలకు ఒక నారీ చొప్పున ఇద్దరు నాఈరలను ఎంపిక చేశామన్నారు. 25 సంఘాలు, అంతకంటే ఎక్కువ స్వయం సహక సంఘాలు ఉన్న గ్రామ సంఘాలకు పది సంఘాలకు ఒక నారీతో పాటు ఇద్దరు లైవ్ లీ హుడ్ సిఆర్‌పిలను ఎంపిక చేసినట్టు తెలిపారు. ఇప్పటి వరకు 94 మంది సిఆర్‌పిలు పారదర్శకంగా ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షులు కోడ సరస్వతి, కోశాధికారి చంద్రకళ, సిసి రేణుక, లీగల్ కో-ఆర్డినేటర్ కిషోర్, అకౌంటెంట్ మీనా ఎంపికైనట్టు తెలిపారు.

వినియోగదారులు అప్రమత్తం

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు

ప్రజాశక్తి- కవిటి

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం 'వినియోగదారుల హక్కులు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో అనేక రకాల మోసాలు జరుగుతున్నాయని, విద్యార్థులు కూడా వినియోగదారులే కాబట్టి ముందుగా వారు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. 2019 వినియోగదారుల సవరణ చట్టం ప్రకారం మోసం జరిగితే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి మోసాలు పెరుగుతున్నాయని, అప్రమత్తంగా లేకపోతే నష్టపోతారని హెచ్చరించారు. కార్యక్రమంలో వినియోగదారుల క్లబ్ కన్వీనర్ జె.పాపారావు, కో-కన్వీనర్ జి.విష్ణుమూర్తి, పి.హరి, కె.ఉగాది నాయుడు, డి.అనసూయ, బి.శ్రీనుబాబు, కె.కరుణశ్రీ, డి.రమేష్, ఎల్.ఆనంద్, బి.అంజన, జనార్ధనరావు పాల్గొన్నారు.

తప్పెటగుళ్లను వాయిస్తున్న కళాకారులు

అదరగొట్టిన సిక్కోలు తప్పెటగుళ్లు

ప్రజాశక్తి- పలాస

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) ఆధ్వర్యాన గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించిన జానపద కళ సంబరాల్లో జిల్లా తప్పెటగుళ్ల కోనారి హేమసూదన్ బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్తరాంధ్ర గుండె చప్పుడు తప్పెటగుళ్లను వాయిస్తూ.. లయ విన్యాసాలతో ఆకట్టుకునే జానపదాలతో మైమరిపించే మొగ్గలతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ సందర్భంగా టీమ్ లీడర్ కోనారి హేమసుదన్ మాట్లాడుతూ ఉత్తర అమెరికా తెలుగు సంఘం జానపద కళా విద్యా సంబరాలకు ఆహ్వానించిన నాట్స్ చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని, నార్స్ అధ్యక్షులు శ్రీహరి మందాడి, నిర్వాహకులు కె.ఎస్.లక్ష్మణరావు, పి.వి.రమణలకు ధాన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పాలిన శంకర్, కాశీ, రవి, రాజు, హరికృష్ణ, ప్రేమ్‌చరణ పాల్గొన్నారు.

ఐదేళ్ల తర్వాత జంగిల్ క్లియరెన్స్

పనులు ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కవిటి

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఆదేశాల మేరకు 6 కిలోమీటర్ల జాడుపూడి-బొరివంక (జేబీ రోడ్) రహదారి జంగిల్ క్లియరెన్స్ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఐదేళ్లకు పైగా నిలిచిపోయిన ఈ పనులు తిరిగి ప్రారంభం కావడంతో జాడుపూడి, ఆర్.బెలగాం, దూగాన పుట్టుగ, బి.గొనపపుట్టుగ గ్రామాల ప్రజలు అశోక్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మణిచంద్రప్రకాష్, జడ్ఆర్‌యుసిసి సభ్యుడు శ్రీనివాస రౌళో, బెలగాం పంచాయతీ అధ్యక్షుడు జి.ధర్మారావు, కార్యదర్శి జ్యోతి, కూటమి నాయకులు మోహనరావు, కేశవరావు, దుర్యోధన, కె.కృష్ణాజావు, భూనమల, సునీల్, దివాకర్, సాగర్ సిసింద్రీ, మనోజు, హేమాచలపతి పాల్గొన్నారు.

కృష్ణచైతన్య పరామర్శ

ప్రజాశక్తి- నరసన్నపేట

మండలంలోని బొరిగివలసలో ఇటీవల మృతి చెందిన తంగి భద్రమ్మ కుటుంబ సభ్యులను పోలాకి జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య సోమవారం పరామర్శించారు. కార్యక్రమంలో పొందర కూరాకుల విభాగం అధ్యక్షుడు రాజాపు అప్పన్న, నియోజకవర్గ పంచాయతీరాజ్ అధ్యక్షులు బగ్గు రమణయ్య, బూత్ కమిటీ అధ్యక్షులు బొబ్బాది ఈశ్వరరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు తంగి అప్పల రామన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి : మండలంలోని కవిటి సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి కపాసుకుద్ది ఫీడర్‌లో ఆర్‌డిఎస్ఎస్ పనులు నిమిత్తం బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కారికానాపుట్టుగ, ప్రగడపుట్టుగ వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

సాయికుమార్ పరామర్శ

లావేరు: మండలంలోని లక్ష్మీపురం ఎంపిటిసి పట్నానపేట గ్రామానికి చెందిన కాగితాల కృష్ణారెడ్డిని ఎచ్చెర్ల వైసిపి నాయకులు పిన్నింటి సాయికుమార్ సోమవారం పరామర్శించారు. కృష్ణారెడ్డి అత్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసున్న ఆయన పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో రణస్థలం జెడ్‌పిటిసి టి.సీతారాం, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకట రెడ్డి, ఎంపిటిసి సంఘం అధ్యక్షులు మహంతి చినరామునాయుడు, రణస్థలం మాజీ సర్పంచ్ పిన్నింటి లక్ష్మనాయుడు తదితరులున్నారు.

విద్యార్థుల క్షేత్ర పరిశీలన

పొందూరు: మండల కేంద్రంలో బెజ్జిపురం యూత్‌క్లబ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇండియా లిటరసీ ప్రాజెక్టు స్కూల్ రెడీనెస్ అండ్ బాలవికాస్ కార్యక్రమంలో భాగంగా సోమ వారం విద్యార్థుల క్షేత్ర పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు హైస్కూళ్లు, కళాశాలలకు చెందిన బాలలహక్కుల లీడర్స్‌కు పోలీస్‌స్టేషన్, ఫైర్‌స్టేషన్, ఎఎఫ్‌కెకె సంఘం, వెటర్నరీ ఆస్పత్రులను సందర్శించి వారి విధులు, బాధ్యతలు తెలుసు కున్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మెడల్స్ ఫెసిలిటేటర్ టి.కరుణాకరరావు, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ కె.శ్రావణి, ఎ.అప్పల నాయుడు, పి.అప్పలనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ప్రతిభ

మెళియాపుట్టి : డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు నిర్వహించిన లీప్ టీచర్స్ టోర్నమెంట్‌లో భాగంగా ఉమెన్ త్రో బాల్ డివిజనల్ లెవెల్ పోటీల్లో మండలానికి చెందిన ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచారు. ఈ టోర్నీలో టెక్కలి, పలాస, శ్రీకాకుళం డివిజన్లకు చెందిన 30 మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు, పీడీలు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మన్ పరామర్శ

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నెమలికి చెందిన దాసరి పద్మావతి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న చైర్మన్ బల్ల గిరిబాబు మృతురాలి కుటుంబానికి పరామర్శించారు. అనంతరం చిత్రటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈయనతో పాటు వల్లభ వైకుంఠరావు, డి.నాగభూషణరావు ఉన్నారు.